https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్

ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 333 గురువారం 19-2-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా

రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో

పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## 8 ఏళ్లలో హైదరాబాద్

# నెట్ జీరో సిటీ

**పర్యావరణ పరిరక్షణలో హరిత ఇంధనమే కీలకం**

**తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం**

**అదే మా ప్రభుత్వ లక్ష్యం**

**రాష్ట్రాన్ని 'క్యూర్, ప్యూర్, రేర్' జోన్లుగా విభజించాం**

**చైనా1కు ప్రత్యామ్నాయంగా నిలుపుతాం**

**ఢిల్లీలో ప్రధాని విందులో పాల్గొన్న ముఖ్యమంత్రి**

**రేవంత్‌ను ఆప్యాయంగా పలకరించిన మోదీ**

**రేపు ఏఐ సమ్మిట్‌లో ప్రసంగించనున్న రేవంత్**

**నేడు తెలంగాణ కాంగ్రెస్ నేతలతో అధిష్ఠానం భేటీ**

**మల్లికార్జున ఖర్గే, రాహుల్ నేతృత్వంలో సమావేశం**

**పాల్గొననున్న సీఎం, మీనాక్షి, మహేశ్, మంత్రులు**



హైదరాబాద్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18 : తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణలో హరిత ఇంధనమే కీలకమని తెలిపారు. రాష్ట్రంలో హరిత ఇంధనానికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'క్లైమేట్ వీక్' సదస్సులో బుధవారం సీఎం రేవంత్ పాల్గొని మాట్లాడారు. దేశంలోని పట్టణాలు, నగరాల అభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యల విషయంలో తెలంగాణ దృక్కోణాన్ని వివరించారు. బొగ్గు, సంప్రదాయ ఇంధన వనరుల వినియోగాన్ని.. సౌర, హరిత ఇంధనం వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. 2034 నాటికి హైదరాబాద్‌ను నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. పట్టణాభివృద్ధిలో భాగంగా కార్బన్ ఫుట్ ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందన్నారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టంచేశారు. అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ కీలకంగా మారాయని రేవంత్ అన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అని చెప్పారు. విద్యుదుత్పత్తి, వినియోగం.. అభివృద్ధికి కొలమానంగా నిలుస్తాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి కోసం తెలంగాణను క్యూర్, పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్), రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ(రేర్) జోన్లుగా విభజించామని తెలిపారు. ప్యూర్‌ను అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి 'చైనా1'కు ప్రత్యామ్నాయంగా రాష్ట్రాన్ని నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ తయారీ వృద్ధి హరిత ఇంధనం ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్తును వినియోగిస్తున్నట్లు తెలిపారు. 2034 నాటికి గరిష్ఠ డిమాండ్ 34 వేల మెగావాట్లకు చేరుతుందన్న అంచనా ఉందన్నారు. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే విద్యుత్తులో సుమారు 25 శాతం వరకు హరిత వనరుల నుంచే వస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లోని క్యూర్ పరిధిలో ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులు తొలగించడంతో వాటి వినియోగం బాగా పెరిగిందన్నారు. అలాగే తెలంగాణలోనే ఈవీల తయారీ కోసం పలు సంస్థలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చే దిశగా 2 లక్షలకు పైగా ఆటోలను రిట్రోఫిట్ చేస్తుండగా, 3000 పైగా ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు, డేటా సెంటర్లు, పరిశ్రమలు హరిత ఇంధనాన్ని కోరుకుంటున్నాయని రేవంత్ తెలిపారు. తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న క్రమంలో వనరుల పెరుగుదలలో హరిత ఇంధనం కీలకంగా ఉండాలన్నదే తన సంకల్పమని తెలిపారు. వాతావరణ మార్పులు, కొవిడ్ ప్రభావాలను ప్రస్తావిస్తూ.. ప్రస్తుత పరిస్థితిని 'క్లైమేట్ ఎమర్జెన్సీ'గా సీఎం అభివర్ణించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి, ఉత్పత్తి, వినియోగం పెంపులతో పాటు పర్యావరణ పరిరక్షణకూ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను సీఎం రేవంత్ వివరించారు. హైడ్రా రూపంలో ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారతదేశ అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. 1991 నుంచి 2020 వరకు కీలక సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తిమంతమైన దేశంగా ఎదిగిందని చెప్పారు. ప్రపంచంలో అధిక అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలు మనదేశంలోనే ఉన్నాయన్నారు.

**ప్రధాని విందులో సీఎం రేవంత్‌రెడ్డి**

'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' సందర్భంగా ప్రధాని మోదీ బుధవారం రాత్రి విందు ఏర్పాటు చేశారు. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. వివిధ దేశాల అధినేతలు, అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌ను ప్రధాని ఆప్యాయంగా పలకరించారు. తెలంగాణను గ్లోబల్‌హబ్‌గా మార్చాలనే సంకల్పంతో పనిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఏఐ సమ్మిట్‌లో ప్రసంగించనున్నారు. రాష్ట్రంలో కృత్రిమ మేధలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వివరించనున్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలతో పార్టీ అధిష్ఠానం గురువారం ఉదయం కీలక సమావేశం నిర్వహించనుంది. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీల నేతృత్వంలో ఈ సమావేశం జరగనుంది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు, ఏఐసీసీ కార్యదర్శులు ఢిల్లీ చేరుకున్నారు. రేవంత్ నేతృత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ పనితీరుపై అధిష్ఠానం సమీక్షించనుంది. కాగా, మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలను మర్యాదపూర్వకంగా కలిశారు.

## తెలంగాణ క్యాబినెట్‌ను ఢిల్లీకి

# పిలిపించుకోవడం సిగ్గుచేటు

**ఢిల్లీకి తెలంగాణ ఆత్మగౌరవం తాకట్టు**

**స్కాంలు తప్ప.. ఇక్కడ స్కీమ్‌ల అమల్లేదు**

**హామీలను అమలు చేయాలని సీఎంకు హితబోధ చేయండి**

**కాంగ్రెస్ అగ్ర నాయకత్వానికి హరీశ్ లేఖ**



హైదరాబాద్, ఫిబ్రవరి 18: తెలంగాణ క్యాబినెట్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం ఢిల్లీకి పిలిపించుకోవడం సిగ్గుచేటని, ఈ చర్య ప్రజాస్వామ్యం సిగ్గుతో తలదించుకునే ఉందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు అన్నారు. స్వయం పాలన, స్వీయ రాజకీయ అస్తిత్వం కోసం ప్రాణత్యాగాలతో తెలంగాణ తెచ్చుకున్నామని, ఢిల్లీ దర్బార్‌లో మోకరిల్లుతూ రాష్ట్ర మంత్రివర్గం ఈ నేల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెడుతోందని మండిపడ్డారు. తాము ఓట్లేసి ఎన్నుకున్నది ఒక స్వతంత్ర ప్రభుత్వాన్నా? లేక ఢిల్లీకి గులాంగిరి చేసే సామంత ప్రభుత్వాన్నా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఆ పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు, కర్ణాటక సీఎం సిద్దారామయ్యకు బుధవారం హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై ఢిల్లీలో సమీక్ష నిర్వహిస్తున్న మీకు, ఎన్నికల సమయంలో ఇక్కడి ప్రజలకు మీరిచ్చిన హామీలను గుర్తు చేస్తున్నామని లేఖలో పేర్కొన్నారు. తెలంగాణలో స్కీంలేవీ లేకపోగా స్కాములు మాత్రం మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నాయని, ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయడంలేదన్నారు. తెలంగాణ ప్రజాధనాన్ని దోచుకుంటున్న కాంగ్రెస్ దోపిడీ ప్రభుత్వం జాతీయ కాంగ్రెస్ రాజకీయ అవసరాలకు ఎరువుగా మారుతోందని ఆరోపించారు.

## ఏడుగురు దేశాధినేతలతో

# ద్వైపాక్షిక చర్చలు

**ఏఐ సమ్మిట్ నేపథ్యంలో మోదీ బిజీబిజీ**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం ఒక్కరోజే ఏడు దేశాల అధ్యక్షులు, ప్ర?ధానులతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రెండు కంపెనీల సీఈవోలతో సమావేశమయ్యారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఢిల్లీకి చేరుకున్న ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ గుటెర్రెస్, ఐఎంఎఫ్ ఎండీ క్రిష్టినా జార్జియేవా, శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే, భూటాన్ ప్రధాని త్సెరింగ్ తోబ్‌గే, మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గూలమ్, క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్, సెర్బియా అధ్యక్షుడు అలెక్సాండర్ వుసిస్, స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్, ఫిన్‌లాండ్ ప్రధానమంత్రి పీటెరి ఆర్పో, ఎస్తోనియా అధ్యక్షుడు అలార్ కరిస్, షీసెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిల్లే, గ్రీస్ ప్రధాని కైరియాకోస్ మిట్సోటకిస్ గయానా ఉపాధ్యక్షుడు భార్రత్ జగ్దేవ్ తదితరులకు స్వాగతం పలికారు. ఏడుగురు దేశాధినేతలతో వేర్వేరుగా సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

## దానంపై అనర్హత పిటిషన్‌పై

# స్పీకర్ విచారణ పూర్తి

**పిటిషనర్లు కౌశిక్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి హాజరు**

**నేడు కడియంపై అనర్హత పిటిషన్‌పై విచారణ**



హైదరాబాద్, ఫిబ్రవరి 18 : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత విధించాలని వేసిన పిటిషన్‌పై శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బుధవారం విచారణ జరిపారు. పిటిషనర్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలతో స్పీకర్ వేర్వేరు సమయాల్లో భేటీ అయి విచారణ జరిపారు. ఈ విచారణకు తమ న్యాయవాదితో కలిసి హాజరైన పిటిషనర్లు.. తమ వద్ద ఉన్న సాక్ష్యాధారాలను స్పీకర్‌కు సమర్పించారు. వారి వద్ద వివరాలను సేకరించిన స్పీకర్.. దానం నాగేందర్, ఆయన తరఫు న్యాయవాదిని పిలిపించి మరోరోజు విచారణ జరపనున్నట్లు అసెంబ్లీ వర్గాలు తెలిపారు. ఇదిలా ఉండగా.. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై వేసిన అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గురువారం విచారణ జరపనున్నారు. ఇందు కుగాను ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని సూచి స్తూ.. పిటిషనర్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకాన ందకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసును పంపారు. కాగా.. ఆయన తన న్యాయవాదితో కలిసి నేడు విచారణకు హాజరుకానున్నారు. ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక తప్పదని, ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం అసెంబ్లీ వద్ద ఆయన మీడి యాతో మాట్లాడుతూ.. విచారణలో దానం కప్పుకున్న కండువాపై చేతిగుర్తు లేదుకదా అని తనను ప్రశ్నించారన్నారు.

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

**- పోర్టల్‌లో లొసుగుల ఆధారంగా స్కాంలు**

**- చలానా కుంభకోణం.. వ్యవస్థాగత లోపం - అక్రమార్కులపై కఠిన చర్యలు: పొంగులేటి**

**- కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులకు మంత్రి ఆదేశం**

హైదరాబాద్, ఫిబ్రవరి 18

ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివ?సరెడ్డి అన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణగా ఉండాల్సిన వ్యవస్థను గత పాలకులు స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరా చేసుకుని స్టాంప్ డ్యూటీ కుంభకోణాలకు పాల్పడినట్లు ఉన్నత స్థాయి విచారణ కమిటీ విచారణలో తేలింది. చలానా కుంభకోణం కేవలం సాంకేతిక లోపాల వల్ల జరిగిన పని కాదని, వ్యవస్థాగతంగా సృష్టించిన లోపమని కమిటీ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో సచివాలయంలో బుధవారం ఉన్నతస్థాయి కమిటీతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. గత పాలకులు తెచ్చిన ధరణి పోర్టల్ సెక్యూరిటీ ఆడిట్ చేసిన సమయంలో గుర్తించిన లోపాలను సరిదిద్దకుండానే అంతా సవ్యంగా ఉన్నట్లు నివేదిక ఇచ్చారని తెలిపారు. మానవ ప్రమేయంతో తప్పులు చేసేందుకు వీలుగా పోర్టల్ ఉందన్నారు. భూముల లావాదేవీలకు సంబంధించి.. అనుమానాస్పదంగా ఉన్న భూముల సమాచారం లభ్యం కాకుండా లాగిన్‌లు డిలీట్ చేశారని, అత్యంత రహస్యంగా ఉండాల్సిన లాగిన్ వివరాలను కనిపించకుండా చేశారని విచారణలో తేలిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన భూ లావాదేవీల వివరాలు అందుబాటులో లేకుండా చేశారని, ధరణి సాఫ్ట్‌వేర్‌లో ఉన్న లోపాలపై కనీసం కోడ్ ఆడిట్ కూడా నిర్వహించలేదన్న విషయం ఫోరెన్సిక్ ఆడిట్‌లో వెలుగు చూసిందని చెప్పారు. ఈ నేపథ్యంలో తక్షణమే ధరణి పోర్టల్‌పై కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోర్టల్ నిర్వహణను గత పాలకులు టెర్రాసిస్ అనే విదేశీ



సంస్థకు అప్పగించడం వల్లనే సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు.

# రాజ్యసభకు సుదర్శన్‌రెడ్డి, సింఘ్వీ?

**తెలంగాణ తరపున కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించే అవకాశం**

**రేసులో వేం నరేందర్‌రెడ్డి, హర్కార**

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18

తెలంగాణకు సంబంధించి ఎన్నికలు జరగనున్న రెండు రాజ్యసభ స్థానాల్లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డితోపాటు అభిషేక్ మను సింఘ్వీకి అవకాశం కల్పించనున్నట్లు తెలిసింది. తెలంగాణ నుంచి కె కేశవరావు రాజీనామాతో ఆ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరపున రాజ్యసభకు ఎన్నికైన అభిషేక్ మను సింఘ్వీ, బీఆర్ఎస్ ఎంపీ సుర్థ?షరెడ్డి పదవీ కాలం ఏప్రిల్ నెలతో ముగియనుంది. ఇందులో ఒక స్థానాన్ని అధిష్ఠానం తన కోటా కింద తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అభిషేక్ మను సింఘ్వీ రాజ్యసభకు ఎన్నికై ఏడాదిన్నర మాత్రమే అవుతున్న నేపథ్యంలో ఆయన్ను మరోసారి అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. రెండో స్థానానికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరును కాంగ్రెస్ పార్టీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి తరపున అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పోటీ చేసి



ఓటమిపాలైన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ కోరిక మేరకు ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసిన సుదర్శన్‌రెడ్డిని రాజ్యసభకు ఎంపిక చేసి గౌరవించుకోవాలన్న ఆలోచనలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు చెబుతున్నారు.

## రఫేల్ ఫైటర్లలో..

# భారత్ వాటా పెంచాలి

**భారత్‌లో తయారైన విడిభాగాలు**

**50 వరకు వాడాలని ఫ్రాన్స్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విజ్ఞప్తి**

**114 రఫేల్ ఫైటర్ల కొనుగోలు**

**ఒప్పందంపై రాని స్పష్టత**



బెంగళూరు/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: రఫేల్ ఫైటర్ల కొనుగోలు ఒప్పందంలో భాగంగా 50శాతం వరకు భారత్‌లో తయారైన విడిభాగాలను వినియోగించాలని ఫ్రాన్స్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విజ్ఞప్తి చేశారు. బెంగళూరులో జరిగిన భారత్-ఫ్రాన్స్ ఆరో వార్షిక రక్షణ సదస్సులో ఫ్రాన్స్ రక్షణ మంత్రి కేథరీన్ వోట్రిన్‌తో 114 రఫేల్ ఫైటర్ల కొనుగోలు ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా రఫేల్ ఫైటర్ల ఇంజన్లు, వాటి పునరుద్ధరణ (ఓవర్ హాలింగ్) భారత్‌లోనే జరగాలని, అది మేకిన్ ఇండియా ప్రయత్నాలకు తోడ్పడుతుందని రాజ్‌నాథ్ కోరినట్టు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. అయితే ఈ 114 రఫేల్ ఫైటర్ల కొనుగోలుకు సంబంధించి ఇంకా ఒప్పందమేదీ జరగలేదు. మరోవైపు ముంబైలో మోదీతో భేటీ అనంతరం మాట్లాడిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్.. 'రఫేల్ ఫైటర్ల నుంచి జలాంతర్గాముల వరకు రక్షణ సహకారం పెంచుకుంటున్నాం' అని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఫ్రాన్స్ నుంచి మరికొన్ని స్కార్పీన్ తరహాకు చెందిన జలాంతర్గాములను కొనుగోలు చేసే అవకాశం ఉందని అంటున్నారు. ప్రపంచ సృజనాత్మక రంగంలో భారత్ ప్రాభవం పెరుగుతోందని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ 'భారత్-ఫ్రాన్స్ ఇన్నోవేషన్ ఫోరమ్' కార్యక్రమంలో ప్రశంసించారు.

మన సమాజం
తెలుగు డిజిటల్ దినపత్రిక
గురువారం, ఫిబ్రవరి 19, 2026

# దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

**దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో ఏసీబీ డిఎస్పి గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు**






**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 18**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు సర్కిల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

ఏసీబీ డిఎస్పి గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో ఉదయం ఆఫీస్ మొదలు కాకముందే చేరుకున్న అధికారులు డిప్యూటీ కమిషనర్ ఎం వెంకటేశ్వర్ నాయక్ క్యాబిన తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వివిధ శాఖల అధికారులతో పాటు శాఖల ఉద్యోగుల సెల్ ఫోన్ లు కంప్యూటర్లు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారుల ఆకస్మిక తనిఖీలతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. దుండిగల్ సర్కిల్ కి అవినీతి నిరోధక శాఖ అధికారులు ఉదయం నుండి తనిఖీలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రెవిన్యూ టౌన్ ప్లానింగ్ విభాగాలకు చెందిన అధికారులతో పాటు ఔట్సోర్సింగ్ సిబ్బంది ఆయా శాఖల సిబ్బంది విధులకు రాలేదు ఆయా విభాగాలకు చెందిన రికార్డులను పరిశీలించిన అధికారులు టౌన్ ప్లానింగ్ శానిటేషన్ రెవిన్యూ విభాగాలలో అవినీతి జరిగినట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఏసీబీ డిఎస్పి శ్రీధర్ మాట్లాడుతూ ఫిర్యాదులో భాగంగా ఆకస్మిక తనిఖీలు చేసినట్లు తెలిపారు. అనాథరెజ్ ఉద్యోగులను గుర్తించామన్నారు. ఫిర్యాదులో భాగంగా ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి శాఖలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు గాలికి..

**26 నెలలైనా తీరని మహిళల, వృద్ధుల నిరీక్షణ.. కప్పాటి పాండురంగా రెడ్డి ఆగ్రహం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 18**

ఎన్నికల సమయంలో అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం కొలువుదీరి 26 నెలలు గడుస్తున్నా, ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీల అమలులో దారుణమైన జాప్యం జరుగుతోందని ఆయన విమర్శించారు. బుధవారం ?విలేకరులకు అందజేచేసిన పత్రికా ప్రకటనలో ఆయన ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ ఈ క్రింది డిమాండ్లను లేవనెత్తారు. ప్రతి నెల మహిళలకు ?2500 మహా లక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సహాయం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, 26 నెలలు గడిచినా ఆ ఊసే ఎత్తకపోవడం మహిళా లోకాన్ని వంచించడమే. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్య పింఛన్ 4000లకు, దివ్యాంగుల పింఛన్ ?6000లకు పెంచుతామని ఆడబిడ్డ వివాహానికి తులం బంగారం, చదువుకునే అమ్మాయిలకు స్కూటీలంటూ ఇచ్చిన హామీ ఏమైంది? పెరిగిన ధరలతో అల్లాడుతున్న సామాన్యులకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం, కాలయాపన చేస్తూ తత్సారం చేయడం అన్యాయం. తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, పింఛన్లు ఇవ్వడంపై సాక్షాత్తూ హైకోర్టు ప్రశ్నించే పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. తెలంగాణ సాధనలో ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. "ఎన్నికల హామీలను నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. ఇప్పటికైనా ప్రభుత్వం కుంటి సాకులు మానుకొని, తక్షణమే పెంచుతామన్న పింఛన్లను, మహిళలకు ఇస్తామన్న నగదును విడుదల చేయాలి. ఈ ఆర్థికసంవత్సరం ప్రవేశపెట్టే బడ్జెట్ లో నైన మహిళలకు, వృద్ధులకు, దివ్యాంగులకు,ఉద్యమకారులకు,రైతులకు ఇచ్చిన హామీలు అమల య్యేలా కేటాయింపులు చెయ్యా లని అన్నారు. లేనిపక్షంలో రాజకీయ పార్టీగా ఎర్పడుతున్న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడ తాం" అని కప్పాటి పాండురంగా రెడ్డి హెచ్చరించారు.

# మరిపెడ పిహెచ్సిని సందర్శించిన డిఎంహెచ్ఓ రవి రాథోడ్





**మరిపెడ,ఫిబ్రవరి 18**

మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి రాథోడ్ బుధవారం మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు తమ గర్భం దాల్చిన 12 వారాల లోపే తప్పనిసరిగా పేర్లను నమోదు చేసుకునేలా చూడాలని,మొదటి రెండు పరీక్షలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో,ఆ తర్వాత పరీక్షలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేసుకునేలా చూడాలని,30 ఏళ్లు పైబడిన వారందరికీ బీపీ,మధుమేహం,క్యాన్సర్ వంటి వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించి అవసరమైన మందులు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును,ఆన్లైన్ పోర్టల్లలో డేటా అప్డేట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న పేషెంట్స్ తో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి,డాక్టర్ పూజిత,హెల్త్ ఎడ్యుకేటర్ రాజు,స్టాఫ్ నర్స్ మమత,తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ టాలెంట్ టెస్టులో సత్తా చాటిన గుండెపుడి విద్యార్థులు

**ప్రథమ బహుమతి సాయి,ద్వితీయ బహుమతి రోహిత్**

**మరిపెడ,ఫిబ్రవరి 18**





మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులో మండల పరిధిలోని జెడ్పిహెచ్ఎస్ గుండెపుడి కి చెందిన విద్యార్థులు పెద్దబోయిన సాయి ప్రథమ బహుమతి,పెద్దబోయిన రోహిత్ ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానో పాధ్యాయులు సిహెచ్ మురళీకృష్ణ, ఉపాధ్యాయిని ఉపాధ్యా యులు సరోజ,కల్పన, దత్తప్రసాద్,శ్రీను,కృష్ణారెడ్డి,రాజు,లింగ నాయక్, ఉషావాని, రమాదేవి, మమతలు విద్యార్థులను అభినందించారు.

## మహబూబాబాద్ ఘటనలో చికిత్స పొందుతూ ప్రియుడి మృతి

**మహబూబాబాద్ ఫిబ్రవరి 18**



వివాహానికి ఒప్పుకోలేదనే కోపంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రం ప్రగతినగర్లో ఓ మహిళపై పెట్రోల్ పోసి తానూ నిప్పంటించుకున్న ఘటనలో తీవ్రంగా గాయపడిన కుంట అంజయ్య (45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రగతినగర్ కాలనీలోని ఓ అద్దె ఇంట్లో పాల దుకాణం నిర్వహిస్తున్న అంజయ్యకు అదే కాలనీలో కూరగాయల వ్యాపారం చేసుకుంటున్న బానోతు సంధ్యకు వివాహేతర సంబంధం ఏర్పడింది. సంధ్య వివాహానికి ఒప్పుకోలేదనే కోపంతో మంగళవారం ఆమెపై అంజయ్య పెట్రోల్ పోసి, హత్తుకొని నిప్పు అంటించుకున్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇరువురిని స్థానికులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అంజయ్య బుధవారం మృతి చెందగా, సంధ్య మృత్యువుతో పోరాడుతోందని సీఐ మహేందర్రెడ్డి తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

# పడగొట్టిన ప్రజాస్వామ్యం.. తొడగొడుతోంది !



చాలాకాలం తరవాత అంటే...పదేళ్ల తరవాత పార్లమెంటులో ప్రజాస్వామ్యం కనిపిస్తోంది. గతంలో లాగా ప్రధాని మోడీ కాలర్ ఎగరేసే పరిస్థితి లేదు. పూర్తిస్థాయి మెజార్టీ లేకపోవడంతో..చిన్నచూపు చూసిన నేతల ముందు మోకరిల్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. అలాగే విపక్షం కూడా బలంగా ఉంది.దేశ ప్రజాస్వామ్యంలో ఇదో మార్పుగా చూడాలి. అందుకే పార్లమెంటులో చర్చలకు అవకాశం వస్తోంది. విపక్ష సభ్యులు స్వేచ్ఛగా తమ గళాన్ని వినిపిస్తున్నారు. స్పీకర్ ఓం బిర్లా కూడా విపక్ష సభ్యులకు గౌరవం ఇచ్చి వారిని చర్చలో పాల్గొనేలా చేస్తున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంలో భాగంగా విపక్షనేత రాహుల్, సమాజ్వాదీ నేత అఖిలేశ్ యాదవ్ తదితరులు పార్లమెంటులో నిర్భయంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. అందులో తప్పులు తీసేస్తే..నిజాలు కూడా చాలా ఉన్నాయి. వారి విమర్శలను సూచనలుగా తీసుకుంటే ప్రజలకు మేలు కలుగుతుందని మోడీ గుర్తించాలి. పార్లమెంటులో ఈ పరిణామం ఇక బిజెపిలో కూడా రావాల్సి ఉంది. ఎందుకంటే బిజెపిలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకుండా పోయింది. ఏ అంశంపైనా, తీసుకునే నిర్ణయంపైనా పార్టీలో చర్చించిన దాఖలాలు లేవు. గత పదేళ్లుగా నిరంకుశ విధానాలు సాగాయి. దేశం ఎటు పోతుందో ..ఏ నిర్ణయం తీసుకుంటున్నారో కూడా తెలియదు. ఎంతో హుందాగా, దేశం కోసం వాజ్పేయ్, అద్వానీ లాంటి వారు భారతీయ జనతా పార్టీని ఏర్పాటు చేసి,ప్రజల్లో కొత్త ఆశలను నింపారు. బిజెపిని ప్రజాస్వామ్య పార్టీగా, దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే పార్టీగా తీర్చిదిద్దారు. కానీ వారి ఆశలు అడియాశలు అయ్యాయి. పెద్దలంతా తెరమరుగయ్యారు. పాతతరం నేతలకు ప్రవేశం లేకుండా చేశారు. ఒక క్రమపద్దతిలో వారిని తప్పించారు. పార్టీలోనూ,పార్లమెంట్ లోనూ సీనియర్లు అన్న వాసన లేకుండా చేశారు. ఇప్పుడు పార్టీలో ఇద్దరి పెత్తనమే సాగుతోంది. అందుకే పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం కొరవడ్డది. చాయ్వాలాగా చెప్పుకుంటున్న మోడీ అధికారం చేపట్టిన తరవాత చేస్తున్న విన్యాసాలతో భారత ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. గత యూపిఎ ప్రభుత్వాన్ని గద్దె దింప, మోడీని అందలం ఎక్కించినందకు పదేళ్లుగా నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా గ్యాస్ ధరలు, జిఎస్టీ వాతలు చాలు.. ఈ దేశ ప్రజలు ఎంతగా దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారో చెప్పడానికి. ఇకపోతే నిరుద్యోగం ఎలాగూ పెరిగింది. ఉద్యోగ కల్పన లేదు. చివరకు ఆర్మీలో కూడా అగ్నివీర్ పథకం పేరుతో నాలుగేళ్ల సర్వీస్తో ఉద్యోగాల భర్తీ మొదల య్యింది. ఇంతకన్నా దారుణం ఉంటుందా అన్నద ఇచూడాలి. ఇకపోతే ఉద్యోగాల భర్తీ అన్నదే మర్చి పోయారు. సంస్థలను తెగనమ్మేయడం, బ్యాంకులను ముంచినోళ్లు దేశం దాటివెళ్లినా..చూస్తూ ఉండడం చూస్తున్నాం. ప్రజలు మామూలు బట్టలు కూడా కట్టుకోలేని దుస్థితిలో ఉంటే మోడీ మాత్రం ఖరీదైన సూట్లు వేస్తుంటారు. కట్టిన బట్ట మళ్లీ కట్టకుండా రంగురంగుల ఖరీదైన బట్టలు వేస్తున్నారు. చాయ్ అమ్మిన వ్యక్తి ఇంతగా ఎదిగనందుకు భారతీయ ప్రజలు ఆనందించాల్సిందే. అలా అందరూ ఎదిగితేనే మనదేశ జిడిపి, ఆర్థిక వ్యవస్థ బాగా ఎదిగినట్లుగా మోడీ ఎప్పుడు గుర్తిస్తారో చూడాలి. ఈ క్రమంలో పదేళ్ల కాలం గిర్రున తిరిగింది. అయోధ్య, 370 ఆర్టికల్ పేరు చెప్పి ఓట్లు అడిగినా ప్రజలు నమ్మలేదు. మోడీ పాలనలో నిజాయితీ లేదని గుర్తించారు. అందుకే అయోధ్యలోనూ ఓడించారు. ఇవన్నీ సత్యాలు. ఈ సత్యాలు మాట్లాడితే మోడీకి కోపం వస్తుంది. గత పదేళ్లలో విపక్షం గట్టిగా లేకపోవడం వల్ల వారిని గెంటివేసి పాలన చేశారు. ఇప్పుడా పరిస్థితి లేదు. భారత ప్రజాస్వామ్యం గొప్పదనం ఇప్పుడు కనిపిస్తోంది. గడచిన పదేళ్లలో నరేంద్ర మోడీ నాయకత్వాన కేంద్ర ప్రభుత్వం తప్పులను ఎత్తిచూపే అవకాశం వచ్చింది. రాష్ట్రపతి ప్రసంగంలో కనిపించిన అతిశయాలను ఎండగట్టే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఎన్నికల అనంతరం ఏర్పడిన కొత్త ప్రభుత్వ విధానాలను వెల్లడించాల్సిన రాష్ట్రపతి ప్రసంగం సొంత డబ్బా కొట్టుకునేలాపాత చింతకాయ పచ్చడిలా సాగింది. నీట్ దోషులను శిక్షిస్తామనడం తప్ప కొత్త విషయమేమీ చెప్పలేదు. పేపర్ లీక్ దోషుల్లో ఇసుమంత భయం కూడా లేకుండా పాలన సాగుతోంది. ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు ప్రధానమైనవిగా భావించిన అధిక ధరలు, పెరిగిన నిరుద్యోగం వంటి సమస్యలను వాటికి పరిష్కారాలను లేదా కనీస ఉపశమనం కల్పించడం గురించైనా ప్రస్తావించలేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలను బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్న వైనాన్ని పదేపదే విమర్శిస్తున్నా వాటిగురించి ప్రస్తావించ కుండా ప్రభుత్వ సుపరిపాలన గురించి గొప్పలు చెప్పారు. ఎన్నికల్లో ముఖ్యంగా చర్చనీయాంశమైన అగ్నిపథ్ ఊసే ఎత్తలేదు. ముఖ్యమైన ఎలాంటి చర్చ లేకుండా గిలెటెన్ చేయడం, సభలో హోంమంత్రి వివరణ ఇవ్వాలని కోరినందుకు 140 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం వంటివన్నీ ఇక గతంలో చూశాం. గత పదేళ్లుగా దేశంలో మోడీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తున్న సంగతి వదిలేసి 1975 ఎమర్జెన్సీ గురించి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారు. పార్లమెంటు ఉభయ సభల్లో ఎలాంటి చర్చ లేకుండా ఆమోదింపజేసుకున్న అనేక చట్టాలు అమలులోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్ చట్టం ఇంకా ఆచరణకు రాకపోయినా మహిళా సాధికారతకు ఎంతగానో కృషి జరిగిందని చెప్పుకోవడం దారుణం. వ్యవసాయ చట్టాలను తేవడం, వదిలించుకోవడం కూడా జరిగింది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీలను తుంగలో తొక్కారు. అందుకే ప్రజలు గడచిన రెండు సాధారణ ఎన్నికలకు భిన్నంగా బిజెపికి సొంతంగా మెజార్టీని ఇవ్వలేదు. అయినా మోడీ-అమిత్ షా ద్వయం గతంలో మాదిరిగానే పాలన సాగించా లని ప్రయత్నిస్తున్నారు. అందుకే బీజేపీ వాళ్లు హిందువులే కాదని లోక్సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ నిర్మొహమాటంగా అన్నారు. భయాన్ని, విద్వేషాన్ని, అబద్దాలను వ్యాపింపజేయడం హిందూధర్మం కాదని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో రాహుల్గాంధీ విపక్ష నేత హోదా లో తొలిసారిగా మాట్లాడారు. నిజంగా గతంలో ఇలా మాట్లాడే అవకాశం ఎవరికీ లేదు. ఇప్పుడు విపక్ష సభ్యులు మాట్లాడే అవకాశం తెచ్చుకున్నారు. అధికార కూటమితో తలపడేంతగా విపక్ష బలం పెరిగింది. రాహుల్, అఖిలేశ్ యాదవ్ల్ ప్రసంగంలో పచ్చి నిజాలు ఉన్నాయి. ప్రజలు ఆకలిబాధలు లెక్కలేయాని అఖిలేశ్ చేసిన వ్యాఖ్యలు దేశంలోని పరిస్థితులకు అద్దం పట్టింది. జిడిపి లెక్కలు, దేశం ఆర్థికంగా ఐదో స్థానంలో ఉందన్న లెక్కలు అబద్దాలని తేల్చేశారు. మొత్తంగా ప్రజాస్వామ్యం తలెత్తుకుంది. అందుకు పార్లమెంటులో సాగుతున్న ప్రసంగాలే నిదర్శనంగా చూడాలి.

## ప్రభుత్వ-ప్రతిపక్ష రాజకీయాల్లో

# బలైపోతున్న పోలీసు వ్యవస్థ

### ప్రభుత్వాల స్వార్థం... పోలీసులపై నిందల రాజకీయాలు

**తెలంగాణలో పోలీసు వ్యవస్థ నేడు చట్టానికి కాదు, రాజకీయాలకు జవాబు చెప్పాల్సిన స్థితికి చేరింది**



ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు, కానీ పోలీసులపై ముద్రలు వేయడం మాత్రం మారడం లేదు. నిన్నటి వరకు బిఆర్ఎస్ పోలీసులే అంటూ విమర్శలు, ఈ రోజు కాంగ్రెస్ పోలీసులే అంటూ ఆరోపణలు. ఇది పోలీసుల తప్పా? లేక అధికారంలో ఉన్న ప్రభుత్వాల వైఫల్యమా? ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేసిన పోలీసులనే తర్వాత నిందించడం, తమ రాజకీయ వైఫల్యాలకు కవర్‌గా పోలీసులను నిలబెట్టడం ప్రజాప్రతినిధుల అప్రజాస్వామ్య ధోరణిని బట్టబయలు చేస్తోంది. ఒకే అధికారి ఒక ప్రభుత్వంలో "నమ్మకస్తుడు", మరో ప్రభుత్వంలో "పక్షపాతి"గా మారడం---ఇది వ్యవస్థపై కాదు, పాలకుల నైతికతపై ప్రశ్న.ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితాలు ప్రతికూలంగా వస్తే బాధ్యత వహించాల్సింది మంత్రులు, ఎమ్మెల్యేలు. కానీ తప్పిదాలన్నింటినీ పోలీసులపై నెట్టేయడం ఇప్పుడు పరిపాటిగా మారింది. ప్రజల కోపాన్ని చల్లార్చేందుకు పోలీసుల్ని బలి చేయడం, మీడియాలో వారిని దోషులుగా నిలబెట్టడం--ఇది పాలకుల పిరికితనానికి నిదర్శనం. ప్రజాప్రతినిధులు తమ రాజకీయ లాభాల కోసం పోలీసుల్ని ముందు వాడుకుంటారు; అవసరం తీరాక వారిపైనే నిందల వర్షం కురిపిస్తారు.

**ప్రజాప్రతినిధుల జోక్యం...**

**పోస్టింగ్‌ల పేరుతో బందీ పాలన**

నిజానికి పోలీసు వ్యవస్థను నాశనం చేస్తున్నది నేరస్తులు కాదు-ప్రజాప్రతినిధుల జోక్యం. పోస్టింగ్‌లు, బదిలీలు అన్నీ రాజకీయ నాయకుల చేతుల్లో బందీలుగా మారాయి. కష్టపడి ఉద్యోగం సంపాదించిన పోలీసు అధికారి పోస్టింగ్ పొందాలంటే 10 లక్షల నుంచి 50 లక్షల వరకు ఖర్చు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉందన్న ఆరోపణలు పాలకుల ముఖంపై చెంపపెట్టు. అంతేకాదు, పోస్టింగ్ ఇవ్వడానికి ముందే "ఎవరి మీద కేసు పెట్టాలి, ఎవరి కేసు పక్కన పెట్టాలి, ఎవరిని కాపాడాలి" అన్న ఆదేశాలు రావడం-ఇది పాలన కాదు, మాఫియా తరహా వ్యవస్థ.

ప్రజాప్రతినిధులు చట్టానికి లోబడాల్సిన చోట, చట్టాన్ని తమ చెప్పుచేతల్లో పెట్టుకోవడం వల్లే ఈ దుస్థితి. ఒక ఎమ్మెల్యే, ఒక మంత్రి మాటకు తలొగ్గకపోతే బదిలీ; రాజకీయ అజెండాకు సహకరిస్తే పోస్టింగ్-ఇది పోలీసు వ్యవస్థలో భయాన్ని నాటుతోంది. ఫలితంగా నిజాయితీగా పనిచేసే అధికారులు మూలకు నెట్టబడుతున్నారు, ఒత్తిడికి లొంగినవారే వ్యవస్థలో పైకి వస్తున్నారు. ఇది చివరకు ప్రజలకే నష్టం. న్యాయం రాజకీయ రంగు పూస్తే, చట్టం బలహీనమవుతుంది; చట్టం బలహీనమైతే ప్రజాస్వామ్యం కూలిపోతుంది.

ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఒక విషయం గుర్తుంచుకోవాలి-పోలీసులు మీ వ్యక్తిగత సిబ్బంది కాదు, ప్రజల రక్షకులు. వారిని రాజకీయ యుద్ధాల్లో శత్రువులుగా మార్చడం మానాలి. పోస్టింగ్‌లను అమ్ముకునే రాజకీయాన్ని ఆపాలి. తప్పు జరిగితే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి, పోలీసులపై నెట్టేయకూడదు. లేకపోతే, ఈ రోజు పోలీసులపై వేస్తున్న మచ్చ రేపు మొత్తం పాలనపై శాశ్వతంగా మిగిలిపోక తప్పదు..!

**పార్వతి రాజేష్ కుమార్**
**సీనియర్ జర్నలిస్ట్**

# రైతులను ఆదుకోలేని బీమా పథకాలు



ఎన్నికల్లో హామీలు ఇవ్వడం..గెలిచిన తరవాత నాలుక మడతేయడం నాయకులకు అలవాటుగా మారింది. రైతుల ఆదాయం రెండింతలు చేస్తామన్న మోడీ హామీ పదేళ్లయినా నెరవేరలేదు. నిజానికి దేశంలో పుష్కలంగా నీటివనరులు, సారవంతమైన భూములు ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకునే ఇంజనీరింగ్ నైపుణ్యాలను పాలకులు ప్రదర్శించడం లేదు. నదీజలాలు సముద్రం పాలుకాకుండా...ఏటా వరదలతో అతలాకుతలం కాకుండా...ఆనకట్టలు కట్టాలన్న స్పృహలేకుండా పోతోంది. డబ్బుల కక్కుర్తితో కట్టిన కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు పనికారాకుండా పోతున్నాయి. నదుల అనుసంధానం అన్న మాటే మోడీ ఎత్తడం లేదు. దేశంలో అన్నిరకాల పంటలకు అనువైన నేలలు ఉన్నా, సమగ్ర పంటల విధానం రావడం లేదు. దీంతో రైతులకు పంటలను పండించడం ఎంత కష్టంగా మారిందో..అమ్ముకోవడం అంతకుమించిన భారంగా మారుతోంది. పంటల కొనుగోళ్లు,బీమాల విషయంలో ప్రభుత్వాలు స్పష్టమైన జాతీయ విధానాల ను అవలంబించడం లేదు. దీంతో పంటలు చేతికి వచ్చినప్పుడు ధరలు లేక పోవడం..పంటలు నష్టపోయి నప్పుడు బీమా సొమ్ము అందక పోవడం షరామామూలుగా మారింది. ప్రధానంగా వాణిజ్యపంటల విషయంలో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. దీనిని సవాల్‌గా తీసుకుని రైతులకు అండగా నిలవాల్సిన పాలకులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా సరైన బీమా విధానం లేదు. ఉన్నా రైతులకు అవగాహన లేదు. దీనిని జాతీయ విధానంగా తీసుకుని రవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా పంటలు నష్టపోతున్నరైతులకు సరైన బీమా సౌకర్యం అందడం లేదు. గ్రామాల వారీగా కాకుండా పంట వారీగా బీమా సౌకర్యం రావాల్సి ఉంది. వ్యవసాయం చుక్కాని లేని నావలా తయారవగా వాణిజ్య పంటల సాగు జూదాన్ని తలదన్నింది. మునుపటి ఏడాది మిర్చికి కాస్త రేటు పడటంతో ఖరీఫ్‌లో రైతులు అటు మళ్లారు. రికార్డు స్థాయిలో ఎపిలో లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి అయింది. కౌలు రైతులకైతే లక్షన్నర. పెట్టుబడులు పూర్తిగా నష్టపోయిన రైతులు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో మిర్చికి తామర తెగులు పలు రాష్ట్రాల్లో వ్యాపించినందున జాతీయ విపత్తుగా ప్రకటించి సాయం చేయాల్సిన కేంద్రం చేతు లెత్తేసింది. రాష్ట్రం కేంద్రాన్ని నిలదీయకుండా లేఖలతో సరిపెట్టింది. వీరిద్దరి మధ్య రైతులు సమిధలవుతున్నారు.

# ప్రజల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

**- ప్రధాన సమస్యలపై ఫోకస్ పెట్టని విపక్షం - మోడీ వికసిత భారత్ పేరుతో డంబాచారం**

**న్యూఢిల్లీ:** వికసిత భారత్ పేరుతో ప్రకటనలు మార్మోగుతున్నాయి. ప్రజలకు ఎలా మేలు చేశారో మోడీ గ్యారెంటీలతో ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ సామాన్యులకు మాత్రం ఏం మేలు జరిగిందో చెప్పడం లేదు. ఉచిత రేషన్ అంటున్నారు. కోట్లాది ఇళ్లు కట్టామని అంటున్నారు. ఇన్ని చేసినా ప్రజల జీవితాలు మాత్రం మారలేదు. కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న ఆర్థిక విధానాలు సామాన్యులకు గుదిబండగా మారుతున్నాయి. వారి ఆర్థిక జీవనచిత్రం ఛిద్రం అవుతోంది. తాజాగా కేంద్ర ఆర్థికశాఖ తీసుకున్న నిర్ణయం సామాన్యులకు శరాఘాతంగా మారింది. ఈ విషయాలపై పార్లమెంటులో ఎక్కడా చర్చించడం లేదు. రాజకీయంగా తమకు లబ్ధి చేకూర్చే విషయాలపై మాత్రమే విపక్షాలు గొంతెత్తుతున్నాయి. అందుకోసం పార్లమెంట్ సమావేశాలను స్తంభింప చేస్తున్నాయి. నిజానికి అంతకు మించిన సంక్షోభం ఇప్పుడు ప్రజలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పాన్ నంబర్‌తో ఆధార్ లింక్ చేయడం...వచ్చే ఆర్థిక సంవత్సరం జీవితబీమా మొత్తంపై టాక్స్ విధిస్తూ తీసుకున్న నిర్ణయాలు పేద,మధ్య తరగతి ప్రజలపై పెనుభారంగా మారబోతోంది. ఈ దొంగ దోపిడీ నిర్ణయాలను విపక్షాలు కనీసం గమనించినట్లుగా కూడా లేదు. ఇప్పటికే పాన్‌తో ఆధార్ లింక్ అయివుంటే ఫర్వాలేదు.. కానీ లింక్ చేయాల్సిందే. దీనికి కూడా ఐటి విభాగం ఒక్కో వ్యక్తికి వేయ రూపాయలు వసూలు చేస్తోంది. ఇక నెట్ సెంటర్లలోకి వెళ్లి లింక్ చేసుకోవాలంటే అదనంగా మరో 200 రూపాయలు కట్టాల్సి వస్తోంది. ఇది సామాన్యులపై ఎంతగా భారం పడుతుందో కేంద్ర పాలకులు గమనించడం లేదు. ప్రతి పనికీ ఆధార్, పాన్ అవసరం కావడంతో ప్రజలు తప్పనిసరిగా లింక్ చేసుకుం టున్నారు. ఇదికూడా కేంద్రానికి ఆదాయ వనరుగా మారింది. ఇలా లింక్ చేయడం వల్ల కేంద్రానికి కనీసంగా ఓ 40,50వేల కోట్ల ఆదాయం సమకూర బోతోంది. అలాగే లింక్ చేయకుంటే 50వేలకు పైగా లావాదేవీలపై పదివేల వరకు పెనాల్టీ కట్టాల్సి వస్తుంది. ఇది ప్రజల్లోకి పెద్దగా వెళ్లడంలేదు. దీనిని వెంటనే ప్రజలు గమనించి ముందుకు వెళితే మంచిది. ఇకపోతే ప్రజలు పైసాపైసా పొదుపు చేసుకుని కట్టే జీవితబీమా పాలసీపైనా ఇప్పటికే జిఎస్టీ వసూలు చేస్తున్నారు. హెల్త్ పాలసీలపైనా జిఎస్టీ పేరుతో దండుకుంటున్నారు. గత ఏప్రిల్ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. ఎవరైనా కూడా కొత్తగా జీవితబీమా చేయదల్చుకుంటే... పాలసీ మెచ్యూరిటీ అయిన తరవాత వచ్చే రాబడిపైనా పన్ను విధించబోతున్నారు. ఇది కనీసం 6శాతంగా ఉండబోతోంది. మోడీ ప్రభుత్వం ఇలా ప్రజలను వేపుకుతింటున్న తీరును ప్రజలు గమనించాలి. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధరలు మోత మోగిస్తున్నాయి. అయితే తెలివిగా ఎన్నికల ముందు వంద రూపాయలు తగ్గించారు. పెట్రోధరలు మంటపెడుతున్నాయి. పెద్దనోట్ల రద్దు మొదలు జీఎస్‌టీ వరకు ప్రజల జీవితాలను మోడీ ఆర్థిక విధానాలు అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఢిల్లీలో కూర్చుని తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా సామాన్యులు అతలాకుతలం అవుతు న్నారు. అచ్ఛేదిన్‌కు నిర్వచం లేకుండా పోయింది. కేవలం కొందరి స్వార్థం కోసం, కొందరి ప్రయోజనాల కోసం 90శాతం భారతీయులు ఇబ్బందులు పడాల్సిన దుర్భర పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. అయినా తమేదో ఘనకార్యం చేస్తున్న ట్లుగా బిజెపి పాలకులు బాకాలు ఊదుతు న్నారు. కాంగ్రెస్ కూడా ఇలాంటి సమస్యలపై ఫోకస్ చేయడం లేదు. వారు కూడా ఓట్ల కోసం నగదు బదిలీ పథకాలనే నమ్ముకున్నారు. మహిళలకు ఏటా లక్ష వరకు ఖాతాల్లో వేస్తామని ప్రకటించారు. ఇప్పటికే జీఎస్టీ భయాలు వెన్నాడు తున్నా వాటిని సవరించి ఆదుకుంటామన్న ఒక్కమాట కూడా ప్రభుత్వం నుంచి రావడం లేదు. దీంతో ప్రజలకు ఈ ప్రభుత్వం భరోసగా లేదన్న విషయం అర్థం అవుతోంది. విపక్షాలు కూడా సమస్యలను చర్చించడానికి పార్లమెంట్‌లో అవకాశాలు వచ్చినా వదులుకుని, గొడవలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సమస్యను సమస్యగా చర్చించడంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు పూర్తిగా విఫలమయ్యారు. పార్లమెం టులో సమస్యలను ప్రస్తావించడం కన్నా గొడవ చేసి వాయిదా వేయించడంలోనే గత పదదేళ్ల కాలం గడిపారు.

## పౌల్ట్రీ పరిశ్రమలో నష్టాలే ఎక్కువ

**- ధరలు పెరుగుతున్నా నష్టాలే అధికం**
**- పరిశ్రమల యజమానుల ఆవేదన**



**విజయవాడ:** కరోనా దెబ్బతో తొలినాళ్లలో పౌల్ట్రీ పరిశ్రమ విలవిల్లాడుతోంది. చికెన్ అమ్మకాలు తగ్గాయి. పలు ప్రాంతాల్లో అయితే ఏకంగా కోళ్లను బొందపెట్టారు. అమ్ముకోలేక, కోళ్లను సాకలేక రైతులు నానాయాతన పడ్డారు. చికెన్ కిలో ధర 50కి పడిపోయింది. కానీ ఇప్పుడు మళ్లీ ధరలు పెరిగాయి. కిలో 300కుచేరువలోకి వచ్చింది. దీనికితోడు ఎండాకాలం కావడంతో మరింతగా ధరలుపెరిగే అవకాశం ఉంది. అయినా నష్టాలు తప్పడం లేదని పౌల్ట్రీరైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండేళ్లలో కరోనా దెబ్బకు అన్ని రంగాల్లో మాంద్యం నెలకొంది. మార్కెట్లు కుప్పకూలాయి. బంగారం ధరలు అందుకోలేనంతగా పెరుగుతున్నాయి. ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నవారికి ప్రభుత్వం పారిశ్రామిక రాయితీలు ఇస్తూ వస్తోంది. కానీ ధరలతో దెబ్బతింటున్న సామాన్యులకు మాత్రం ఊరట దక్కడం లేదు. రాష్ట్రంలో పౌల్ట్రీరంగం దాదాపు 25 లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నది. కోళ్లు, గుడ్లు మంచి ప్రొటీన్ అని, ఎలాంటి అనుమానాలు లేకుండా తినాలని.. వస్తున్నప్రచారం నేపథ్యంలో ఇప్పుడిప్పుడే పౌల్ట్రీ పరిశ్రమ మళ్లీ పుంజుకుంటోంది. కరోనా కారణంగా పౌల్ట్రీ రంగం కుదలేయ్యింది. మనిషి ప్రాణాలతో చెలగాటమాడుతున్న మాయదారి మహమ్మారి కరోనా.. అన్నిరంగాలను దెబ్బేసింది. దీనికి తోడు వేసవిలో సాధారణంగా వచ్చే వైరస్‌తో కోళ్లు చనిపోతుండడం కూడా పరిశ్రమకు శాపంగా మారింది. బర్డ్ ఫ్లూ వచ్చినపుడు ఎలాంటి పరిస్థితి ఉందో కరోనా కారణంగా పరిస్థితి ఘోరంగా ఉంది. కేవలం అపోహల వల్లే పరిశ్రమ దారుణంగా దెబ్బతింది. బర్డ్‌ఫ్లూ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పావలా వడ్డీకి రుణాలు ఇప్పించాయి. ఇప్పుడు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదుకోకపోతే పౌల్ట్రీ రంగం నామరూపాల్లేకుండా పోతుంది. దీనిపై ఆధారపడ్డ అనేక అనుబంధ పరిశ్రమలూ దెబ్బతింటాయి. దీని నుంచి గట్టెక్కకపోతే ఈ రంగంపై ఆదారపడి జీవిస్తున్న లక్షలాదిమందికి ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఉంది.

## దేశ సమస్యలపై స్పష్టమైన హామీ ఏదీ ?

దేశంలో మళ్లీ తమదే అధికారం అని బిజెపి ఘంటాపథంగా చెబుతోంది. ఎన్‌డిఎ 400 సీట్లు సాధిస్తుందన్న ధీమాలో ఉంది. కాంగ్రెస్ తమకు పోటీ కాదని, ఇండియా కూటమికి ప్రజల అండలేదని ప్రచారం చేసు కుంటోంది. ఈ క్రమంలో బిజెపి పదేళ్ల పాలనను గీటురాయిగా తీసుకుంటే..అనేక విషయాలు చర్చించాల్సి ఉంటుంది. ప్రధానంగా పెట్రో, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్టీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తు న్నారు. నోట్ల రద్దు కారణంగా సామాన్యులు పడ్డ ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. నిరుద్యోగం చెప్పడానికి లేదు. ఉద్యోగాల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఉపాధి అవకాశాలు అసలు లేకుండా పోయాయి. యువత సర్టిఫికెట్లు పట్టుకుని విదేశాలకు చెక్కేస్తున్నారు. ఈ దేశంలో బతకలేమని కూలీలు గల్ఫ్ దేశాలకు వెళు తున్నారు. రైతులకు మద్దతు ధరలు దక్కడం లేదు. బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. ఉప్పులు,పప్పులు మొదలు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. గృహసంబంధ సిమెంట్, ఇసుక, ఇనుము తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. సామాన్యులు ఇల్లు కొనుక్కుని బతికే అవకాశం లేకుండా చేశారు. కేవలం ప్రభుత్వం కట్టించే ఇళ్లపై ఆధారపడేలా చేస్తున్నారు. ఇదంతా కూడా అభివృద్ధికి చిహ్నమా అన్నది చర్చించాలి. ప్రధాని మోడీ చెబుతున్న వికసిత్ భారత్‌కు ఇదంతా నిదర్శనంగా చూడాలి. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. అమ్మాయిలు చదువుకునే పరిస్థితి లేదు. కనీసం బాలికా విద్యకు అవసరమైన రుణాలకు కూడా వెసలుబాటు లేదు. ఈ క్రమంలో బిజెపి ప్రకటించిన మేనిఫెస్టోలో ఈ అంశాలేవీ చర్చించలేదు. సరికదా స్పృశించలేదు. దేశంలో రైతులు కీలకమైన ఓటు బ్యాంకుగా ఉన్నారు. దీంతో ఈ వర్గాన్ని ఆకట్టుకునేందుకు రెండు పార్టీలు ప్రయత్నించాయి. వ్యవసాయాన్ని సాంకేతికతను జోడించడంతో పాటు.. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను బలోపేతం చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. కనీస మద్దతు ధరపెంచుతామని తెలిపింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో తెలిపింది. వ్యవసాయ ఫైనాన్స్‌పై శాశ్వత కమిషన్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చింది. నిజానికి వ్యవసాయ రంగం అతిపెద్ద పరిశ్రమగా పాలకులు గుర్తించడం లేదు. దీనిని గుర్తించి అనుబంధ పరిశ్రమలు చేపడితే దేశంలో సగం నిరుద్యోగం పోతుంది. అలాగే దేశీయంగా పంటలకు ప్రాధాన్యం పెరుగుతుంది. కానీ రెండు పార్టీలు ఈ రంగంపై పెద్దగా విశ్లేషణ చేయడం లేదు. మహిళా సాధికారత సాధించే దిశగా గ్రామీణ మహిళలను లక్షాదికారులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. అలాగే మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామని బీజేపీ మేనిఫెస్టోలో తెలిపింది.మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి పేదింటి మహిళకు షరతులు లేకుండా ఏడాదికి లక్ష రూపాయిలు నేరుగా ఖాతాల్లో జమచేస్తామని తెలిపింది. 2025 నుంచి మహిళలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 50శాతం రిజర్వేషన్లు. ప్రతి జిల్లాలో కనీసం ఒక సావిత్రీబాయి పూలే హాస్టల్‌తో వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల సంఖ్యను రెట్టింపు చేస్తామని తెలిపింది. సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ కోసం రూ. 25 లక్షల వరకు నగదు రహిత ఆరోగ్య సేవలు పొందే విధంగా బీమా పథకం అమలు, పబ్లిక్ హెల్త్ సెంటర్లలో అన్ని పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తామిన కాంగ్రెస్ తెలిపింది. . ఇలాగే వెళితే దేశంలో సామాన్యులు, పేదలు, మధ్యతరగతి వాళ్లు బతకడం కష్టం కాగలదు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదు. పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారేలా ప్రభుత్వ విధానాలు ఉంటున్నాయి. దేశంలో సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈనెల 19న తొలివిడత పోలింగ్ జరగనుంది. ఏడు విడతల్లో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. గెలుపు కోసం రాజకీయ పార్టీలు వ్యూహాలను సిద్ధం చేశాయి. ముందు ప్రజలను ఆకర్షించేందుకు మేనిఫెస్టోలతో అన్ని పార్టీలు సిద్ధం అయ్యాయి. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీలు తమ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. తమను గెలిపిస్తే ఏం చేస్తామో ప్రజలకు వివరిస్తున్నారు. కాంగ్రెస్ 'న్యాయ్ పత్ర్ ' పేరుతో బీజేపీ 'సంకల్ప్ పత్ర్' పేరుతో ఎన్నికల ప్రణాళికను విడుదల చేశాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు, కాంగ్రెస్, బీజేపీ తమ తమ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. మోదీ గ్యారెంటీ క్యాప్షన్‌తో బీజేపీ సంకల్ప్ పత్ర్ విడుదల చేయగా.. మహిళలు, యువత, నిరుపేదలు, రైతులు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ న్యాయ పత్ర్‌ను రూపొందించింది. ఓ రకంగా చెప్పాలంటే రెండు పార్టీలు యువతను ఆకర్షించే ప్రయత్నం చేశాయి. ఎందుకంటే యువ ఓటర్ల సంఖ్య దేశంలో గణనీయంగా పెరిగింది. బీజేపీ తన మేనిఫెస్టోలో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను సత్వరమే భర్తీ చేశామని, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపింది. కానీ పదేళ్ల పాలనా కాలంలో ఉద్యోగాల కల్పన అన్నది లేకుండా పోయింది. ప్రచారాడంబరం తప్ప ఉద్యోగాలు లేక యువత రోడ్డున పడుతోంది. ఉన్నత చదువులు చదివినా కొలువులు కానరావడం లేదు. దేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చి ఉపాధి అవకాశాలు పెంచుతామని బిజెపి మరోమారు యువతను మోసం చేసే ప్రయత్నం చేసింది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా ముద్ర రుణాల పరిమితిని పెంచుతామని కూడా పేర్కొంది. కానీ ప్రభుత్వ ఉద్యోగాల కల్పనపై స్పష్టమైన హామీని ప్రకటించలేదు. అయితే ఇందుకు భిన్నంగా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి యువ న్యాయ్ కార్యక్రమం అమలు చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో తెలిపింది. డిప్లొమా, గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 25 ఏళ్లలోపు యువకుల కోసం రైట్ టు అప్రెంటీస్‌షిప్ చట్టం తీసుకొస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో 30 లక్షల ఖాళీలను భర్తీ చేస్తామిన తెలిపింది. అధికారంలో ఉన్న బిజెపి మాత్రం ప్రభుత్వ ఖాళీల భర్తీకి ముందుకు రాలేదు. ఇకపోతే సీనియర్ సిటిజన్ల కోసం రెండు పార్టీలు తమ మేనిఫెస్టోలో వివిధ హామీలు ఇచ్చాయి. 70 ఏళ్లు పైబడిన వారికి ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్య సేవలు అందిస్తామని తెలిపింది. తీర్థయాత్రలు చేపట్టే సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను కఠినంగా అమలు చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొంది. సీనియర్ సిటిజన్లు, వితంతువులు, దివ్యాంగులకు జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం కింద పెన్షన్‌ను వెయ్యి రూపాయిలకు పెంచుతామని చెప్పింది. సీనియర్ సిటిజన్లకు ప్రజా రవాణాలో ప్రయాణ రాయితీలను పునరుద్దరిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొంది. రెండు పార్టీలు అన్నివర్గాలను ఆకట్టుకునే విధంగా తమ మేనిఫెస్టోలో పథకాలను పొందుపర్చాయి. కానీ సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ధి ఈ రెండు పార్టీలకు లేదని గతంలో వీరి పాలనా కాలం తీరు చూస్తే అర్థం చేసుకోవచ్చు



## ఒకే నెలలో మూడు సినిమాలు..


# కృతిశెట్టి మళ్లీ ట్రాక్‌పైకి వచ్చేనా..?

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం. కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. మరి చాలా కాలంగా సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న కృతిశెట్టికి ఈ డిసెంబర్ అయినా కలిసి రావాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు.

## హైప్ పెంచుతున్న మాస్టర్ మహేంద్రన్ వసుదేవసుతం టీజర్



దేవి సినిమాతో చైల్డ్ యాక్టర్‌గా సూపర్ క్రేజ్ సంపాదించుకున్నాడు మాస్టర్ మహేంద్రన్. ఈ టాలెంటెడ్ యాక్టర్ హీరోగా నటిస్తున్న చిత్రం వసుదేవసుతం. వైకుంఠ్ బోను డైరెక్ట్ చేస్తున్నాడు. టాలీవుడ్ యాక్టర్ సత్యదేవ్ ఈ మూవీ టీజర్‌ను లాంచ్ చేశాడు. ఈ కథ ధర్మానికి అడ్డొస్తే మేనమామ అయినా.. లక్షల బంధుగణమైనా.. ఎదురుగా కోట్ల సాయుధులే ఉన్నా.. ధర్మ హింస తథైవచ అన్న శ్రీ కృష్ణుడిదే కాదు.. ధర్మాన్ని కాపాడేందుకు ఎంతటి మారణ హోమానికైనా ఎదురెళ్లే యువకుడిది అంటూ సాగుతున్న డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. గుడి, గుప్త నిధి చుట్టూ తిరిగే సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో సినిమా సాగనున్నట్టు టీజర్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, జాన్ విజయ్, మీమ్‌గోపి, తులసి, టార్జన్, రామరాజు, భద్రమ్, జబర్దస్త్ రాంప్రసాద్, శివన్నారాయణ, దువ్వాసి మోహన్, సుమేత బజాజ్, అంబికావాణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలువబోతున్నట్టు టీజర్ ద్వారా తెలిసిపోతుంది. ఈ మూవీ రిలీజ్ డేట్‌పై త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. ఈ చిత్రాన్ని రెయిన్‌బో సినిమాస్ బ్యానర్‌పై ధనలక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు.




## ఆ చాన్స్ వస్తే బాగుంటది!

'సాధారణంగా ఇద్దరమ్మాయిలు, ఓ అబ్బాయి అంటే ముక్కోణపు ప్రేమకథ అనుకుంటారు. కానీ ఈ సినిమాలో ఓ యూనిక్ పాయింట్ ఉంటుంది. అదేంటో ఇప్పుడే చెప్పకూడదు. సినిమా చూసి తెలుసుకోవాల్సిందే' అని చెప్పింది శ్రీనిధి శెట్టి. ఆమె సిద్ధు జొన్నలగడ్డ సరసన ఓ నాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసుకదా' ఈ నెల 17న విడుదలకానుంది. నీరజా కోన దర్శకురాలు. ఈ సందర్భంగా గురువారం పాత్రికేయులతో ముచ్చటించింది శ్రీనిధిశెట్టి. యాక్షన్, రక్తపాతం ఉన్న కేజీఎఫ్, హిట్-3 వంటి చిత్రాల తర్వాత ఓ ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ చేయడం సరికొత్త అనుభూతి అని చెప్పింది. ఈ సినిమాలో తాను రాగ అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తన క్యారెక్టర్‌లో కొంచెం గ్రేషేడ్స్ కనిపిస్తాయని తెలిపింది. 'ఈ సినిమాలోని కొత్త పాయింట్ ప్రతీ ఒక్కరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. లవ్, ఎమోషన్స్, కామెడీ.. ఇలా అన్ని అంశాల కలబోతగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. సిద్ధు జొన్నలగడ్డకు సినిమాకు సంబంధించిన ప్రతి క్రాఫ్ట్‌పై అవగాహన ఉంది. ఆయన టైమింగ్ బాగుంటుంది. ఇక రాశీఖన్నా క్రమశిక్షణ కలిగిన నటి. తన ఆహారపు అలవాట్లు, వర్కవుట్స్ అన్నీ పద్ధతిగా ఉంటాయి' అని శ్రీనిధి శెట్టి పేర్కొంది. వెంకటేష్-త్రివిక్రమ్ సినిమా కథానాయికగా ఎంపికయ్యారనే వార్తలపై స్పందిస్తూ 'నిజంగా ఆ విషయం నాకు తెలియదు. ఆ సినిమా ఛాన్స్ రావాలని కోరుకుంటున్నా.



## అన్నీ ఇక్కడే నేర్చుకున్నా!

'మనస్సినక్కరే' (2003) అనే మలయాళ చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది అగ్ర కథానాయిక నయనతార. ఆ తర్వాత తమిళ, తెలుగు భాషల్లో అగ్ర కథానాయికగా పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా 'చంద్రముఖి' 'గజిని' చిత్రాలు ఆమె కెరీర్‌ను మలుపుతిప్పాయి. ఇక అక్కడి నుంచి దక్షిణాదిలో అగ్ర నాయికగా చెలామణీ అయింది. అభిమానులు ఆమెను లేడీసూపర్‌స్టార్ అని ప్రేమగా పిలుస్తుంటారు. నయనతార ఇండస్ట్రీకి వచ్చి నేటితో 22 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఈ భామ అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఓ నోట్‌ను విడుదల చేసింది. 'నేను కెమెరా ముందుకొచ్చి 22ఏండ్లు గడచిపోయాయి. ఈ ప్రయాణం ఇంతదూరం సాగుతుందని అస్సలు ఊహించలేదు. ఇండస్టీకి వచ్చిన తర్వాతే వృత్తిపరంగా, వ్యక్తిగతంగా పరిణితి లభించింది. ఇక్కడే ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నా. ఓ రకంగా సినీరంగం నాలో ధైర్యాన్ని నింపింది. నన్ను కొత్తగా పరిచయం చేసింది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన అభిమానులందరికి కృతజ్ఞతలు' అని నయనతార పేర్కొంది.